సాక్షి
నారాయణపేట
మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



కమనీయం..
ఆది దంపతుల కల్యాణం

- పట్టువస్త్రాలు సమర్పించిన దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- జోగుళాంబ క్షేత్రానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన అలంపూర్ ఆలయ పరిసరాలు

- వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.5 /20.9

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విధుల్లో మినహాయింపు ఇవ్వాలి



నారాయణపేట రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు ఇబ్బంది ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు కల్పించాలని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం ఆమె ఛాంబర్‌లో కలిసి ఉపాధ్యాయ సమస్యలపై వివరించారు. గర్భిణులు, చంటి పిల్లలు ఉన్నవారు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధితో ఇబ్బందులు పడుతున్న టీచర్లు, ఆరు నెలల్లో పదవీ విరమణ పొందే ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు కేటాయించకుండా చూడాలని కోరారు. శిక్షణ సైతం దసరా పండుగ తర్వాత ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జనార్దన్ రెడ్డి, రఘువీర్ పాల్గొన్నారు.

పంట కొనుగోలుకు కపాస్ కిసాన్ యాప్

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రైతులు పండించిన పంట కొనుగోలు కోసం ప్రభుత్వం కొత్తగా కపాస్ కిసాన్ యాప్ తీసుకువచ్చిందని మార్కెటింగ్ శాఖ రీజినల్ డైరెక్టర్ మల్లేశం అన్నారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులకు యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన పత్తి పంటను అమ్ముకోవడానికి ప్రభుత్వం చాలా సులువైన పద్ధతిని అమలులోకి తెచ్చిందన్నారు. పత్తి అమ్ముకోవాలనుకునే రైతులు మూడు రోజుల ముందు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని, అందులో అనుకూలమైన తేదీ, సమయంతో యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవచ్చని, దాని ప్రకారం పత్తి కొనుగోలు కేంద్రానికి సరుకు తెచ్చి అమ్ముకోవచ్చన్నారు. దీంతో రైతులు తక్కువ సమయంతోపాటు సులువైన పద్ధతిలో పత్తిని అమ్ముకోవచ్చని చెప్పారు. ఈ విధానంపై ఏఈఓలు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డు కార్యదర్శి జయలక్ష్మి, వ్యవసాయ శాఖ ఉమ్మడి జిల్లా అధికారులు, మార్కెటింగ్ శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


ఫుట్‌బాల్ జట్టుకు అభినందన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జనగాంలో ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–19 ఫుట్‌బాల్ పోటీలలో రెండో స్థానం సాధించిన మహబూబ్‌నగర్ జిల్లా బాలుర జట్టును సోమవారం కలెక్టరేట్ వద్ద డీవైఎస్‌ఓ శ్రీనివాస్, డీఐఈఓ కౌసర్‌జహాన్ అభినందించారు. వీరితోపాటు ఎస్‌జీఎఫ్ అండర్–19 ఇన్‌చార్జ్ కార్యదర్శి శారదాబాయి, పెటా టీఎస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, సీనియర్ పీఈటీ వేణుగోపాల్ జట్టులోని క్రీడాకారులను అభినందించారు.

● పల్లె పోరుకు సై..

మోగిన నగారా..

- 2 విడతల్లో ప్రాదేశిక.. 3 దఫాల్లో పంచాయతీ సమరం
- అక్టోబర్ 9 నుంచి నవంబర్ 11 వరకు కొనసాగనున్న ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో 77 జెడ్పీటీసీ.. 800 ఎంపీటీసీ స్థానాలు
- 1,678 గ్రామ పంచాయతీలు.. 15,068 వార్డులకు ఎన్నికలు
- గ్రామాల్లో రాజకీయ సందడి మొదలు.. గెలుపే లక్ష్యంగా పార్టీల కసరత్తు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: బీసీ రిజర్వేషన్ల ఖరారు ఘట్టం ముగియడంతో స్థానిక ఎన్నికలకు నగారా మోగింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీలతోపాటు గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. ఈ మేరకు ఉమ్మడి పాలమూరులో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లోని ఎనిమిది రెవెన్యూ డివిజన్ల పరిధిలో మొత్తం 77 జెడ్పీటీసీ, 800 ఎంపీటీసీ స్థానాలు, 1,678 గ్రామ పంచాయతీలతోపాటు 15,068 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. వచ్చే నెల తొమ్మిది నుంచి ప్రక్రియ ప్రారంభమై నవంబర్ 11 వరకు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో పల్లెల్లో రాజకీయ సందడి జోరందుకోనుంది. స్థానిక ఎన్నికలు వస్తాయని భావించిన ప్రధాన రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు గెలుపే లక్ష్యంగా గ్రామాల్లో తమ వ్యూహాలను అమలుపరిచేలా ముందుకు సాగుతున్నారు.

ఆశావహుల జోరు.. నేతల బేజారు

స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ సందడి మొదలైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో ఆ వర్గానికి చెందిన నాయకులు ఉత్సాహంలో ఉన్నారు. వీరితోపాటు రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన మండలాలు, గ్రామాల్లోని మిగతా వర్గాలకు సంబంధించిన ఆశావహులు ఎక్కువ సంఖ్యలో తమకే అవకాశం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. వారికి సర్దిచెప్పలేక ముఖ్య నేతలు ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. ఇదేక్రమంలో రిజర్వేషన్ల తారుమారుతో భంగపడిన ఆశావహులది మరో సమస్యగా మారినట్లు తెలుస్తోంది. చాలా మండలాల్లో పాత, కొత్త నాయకుల పంచాయితీలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. అధికార పార్టీ కాంగ్రెస్‌లో ఈ పరిస్థితి నెలకొనగా.. ముఖ్య నేతలు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్‌తోపాటు బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు గ్రామాల్లో విస్తృత పర్యటనలకు రంగం సిద్ధం చేసుకుంటుండడంతో రాజకీయ వాతావరణం వేడెక్కనుంది.

జిల్లాలు, విడతల వారీగా పంచాయతీ ఎన్నికల వివరాలు..

జిల్లా	తొలి విడత			2వ విడత			3వ విడత		
	మం.	జీపీలు	వార్డులు	మం.	జీపీలు	వార్డులు	మం.	జీపీలు	వార్డులు
మహబూబ్‌నగర్	5	149	1,194	5	127	1,130	6	147	1,350
నాగర్‌కర్నూల్	6	151	1,326	7	151	1,412	7	158	1,364
వనపర్తి	-	-	-	7	135	1,216	8	133	1,220
జోగుళాంబ గద్వాల	-	-	-	5	131	1,216	08	124	1,174
నారాయణపేట	5	110	994	4	67	572	4	95	900
మొత్తం	16	410	3,514	28	611	5,546	33	657	6,008

రెండు విడతల్లో 'ప్రాదేశికం'


ప్రాదేశిక పోరులో భాగంగా తొలి విడతలో అక్టోబర్ 9 నుంచి 23 వరకు ఐదు జిల్లాల పరిధిలోని 39 మండలాలకు సంబంధించి 39 జెడ్పీటీసీ స్థానాలతోపాటు 426 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. రెండో విడతలో అక్టోబర్ 13 నుంచి 27 వరకు 38 మండలాల పరిధిలోని 38 జెడ్పీటీసీతోపాటు 374 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనుండగా.. రెండు విడతలకు సంబంధించి నవంబర్ 11న ఓట్ల లెక్కింపు చేపడుతారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలో 2,188 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

ఎన్నికల కోడ్ అమల్లోకి..

ప్రాదేశిక, పంచాయతీల పాలకవర్గం గడువు ముగిసి సుమారు ఏడాదిన్నరవుతోంది. ఈ క్రమంలో ఎప్పుడైనా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావొచ్చనే అంచనాతో ఆయా జిల్లాల్లో సంబంధిత శాఖ అధికారులు ముందస్తుగానే సిద్ధమయ్యారు. నోడల్ అధికారులను నియమించి ఎన్నికల ప్రక్రియకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్యాలెట్ పేపర్ ముద్రించి భద్రపరిచారు. వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్లతోపాటు ఓటరు జాబితాలను పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. తాజాగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగా.. సోమవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది. దీంతో ఆయా జిల్లాల అధికార యంత్రాంగం ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తోంది.

మూడు దశల్లో 'పంచాయతీ'

గ్రామ పంచాయతీకి సంబంధించి తొలి విడతలో అక్టోబర్ 17 నుంచి 31 వరకు 16 మండలాల పరిధిలోని 410 జీపీలతోపాటు 3,514 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. రెండో విడతలో అక్టోబర్ 21 నుంచి నవంబర్ 4 వరకు 28 మండలాల్లోని 611 జీపీలతోపాటు 5,546 వార్డులకు.. చివరి దశలో అక్టోబర్ 25 నుంచి నవంబర్ 8 వరకు 33 మండలాల పరిధిలోని 657 జీపీలతోపాటు 6,008 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో మాత్రం తొలి విడతలో పోలింగ్ నిర్వహించడం లేదు. రెండు, మూడో విడతల్లోనే ఆ రెండు జిల్లాల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. కాగా.. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికలు జరిగిన రోజే ఓట్ల లెక్కింపు చేపడుతారు. కాగా.. పంచాయతీ ఎన్నికలకు గాను 2,363 పోలింగ్ కేంద్రాలు కేటాయించారు.



జిల్లాలు, విడతల వారీగా ప్రాదేశిక ఎన్నికల వివరాలు..

జిల్లా	తొలి విడత			2వ విడత		
	మండలాలు	జెడ్పీటీసీ స్థానాలు	ఎంపీటీసీ స్థానాలు	మండలాలు	జెడ్పీటీసీ స్థానాలు	ఎంపీటీసీ స్థానాలు
మహబూబ్‌నగర్	8	8	89	8	8	86
నాగర్‌కర్నూల్	10	10	115	10	10	99
వనపర్తి	8	8	71	7	7	62
జోగుళాంబ గద్వాల	5	5	69	8	8	73
నారాయణపేట	8	8	82	5	5	54

జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- రాజకీయ పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో తక్షణమే స్థానిక సంస్థల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తన నియమావళి)అమలులోకి వచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. సోమవారం ప్రజావాణి సమావేశ మందిరమంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థలు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు సోమవారం షెడ్యూల్ ప్రకటించడం జరిగిందని అందువల్ల తక్షణమే కోడ్ అమల్లోకి వచ్చినట్లు ప్రకటించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి కొత్త ప్రాజెక్టులు, కొత్త మంజూరులు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరపడానికి వీలు లేదన్నారు. అధికారులు నాల్గవ తరగతి ఉద్యోగుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు పొరుగుసేవల సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులు ప్రతి ఒక్కరు ఎన్నికల కమిషన్ పరిధిలో మాత్రమే పనిచేస్తారని, ఎట్టి పరిస్థితుల్లో రాజకీయ నాయకులతో కలిసి, పార్టీ ర్యాలీలో పాల్గొనడం, మరే ఇతర రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొంటే ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కిందికి వస్తుందని, అలాంటి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కోడ్ అమల్లో వచ్చిన ప్రాంతాల్లో వెంటనే రాజకీయ ప్రచారాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, గోడ రాతలు తొలగించాలని ఆదేశించారు. ఈ రోజు నుండి ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందని తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎస్ శ్రీను, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల అర్బన్ హెల్త్ సెంటర్ (పట్టణ ఆరోగ్య కేంద్రం) ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్ లోని అన్ని గదులను పరిశీలించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా.. లేదా అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌కు వచ్చిన పలువురు రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి పరిసరాలను చూసి పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే ఆస్పత్రి లోని అన్ని గదుల కిటికీలకు దోమలు రాకుండా జాలి ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ హెల్త్ సెంటర్‌లో రక్త పరీక్ష చేయించుకున్నారు.కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, హెల్త్ సెంటర్ వైద్య అధికారి డాక్టర్ నరసింహారావు సగరీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

నారాయణపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆమె పరిశీలించారు. అప్పక్పల్లిలో ఓ ఇంటి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచడంతో లబ్ధిదారురాలిని అభినందించారు. అప్పక్‌పల్లికి మొత్తం 50 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 16 ఇళ్ల నిర్మాణాలు రూఫ్ లెవల్, స్లాబ్, లెంటల్ లెవల్ లో కొనసాగుతున్నాయని హౌసింగ్ పీడీ శంకర్‌నాయక్ కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో నారాయణపేట మండలం పురోగతిలో ఉండటంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుదర్శన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పకడ్బందీగా స్థానిక సంస్థల ఎన్నికలు

జిల్లాలో 13 జెడ్పీటీసీ, 136 ఎంపీటీసీలకు గాను రెండు విడతల్లో ఎన్నికలు, అలాగే జిల్లాలోని 272 గ్రామ పంచాయతీలకు మొదటి విడతలో 67 , రెండో విడతలో 95, మూడో విడతలో 110 గ్రామ పంచాయతీలకు ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ వివరించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి రాణికుముదిని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇస్తామని, బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. బోర్డర్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టేలా పోలీసుశాఖ ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. అదనపు కలెక్టర్ శ్రీను, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, ఆర్డీఓ రామచంద్రనాయక్, జెడ్పీ సీఈఓ మొగులప్ప, డీపీఓ సుధాకర్‌రెడ్డి, డీఎస్పీ నల్లపు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులకు వరుస సెలవులు

జడ్చర్ల/ దేవరకద్ర: జిల్లాలోని ప్రధానమైన బాదేపల్లి, దేవరకద్రలోని వ్యవసాయ మార్కెట్ యార్డులకు వరుస సెలవులు వచ్చాయి. దసరా పండుగను పురస్కరించుకుని బాదేపల్లి యార్డుకు మంగళవారం నుంచి శుక్రవారం వరకు సెలవులు ప్రకటించినట్లు యార్డు చైర్‌పర్సన్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే దేవరకద్ర మార్కెట్ యార్డుకు వరుసగా 5 రోజులు సెలవు ఉందని కార్యదర్శి జయలక్ష్మి పేర్కొన్నారు. తిరిగి శనివారం నుంచి లావాదేవీలు కొనసాగుతాయన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



మక్తల్‌లో బతుకమ్మకు పూజలు చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు

మక్తల్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య సహకార, పాడిపరిశ్రమల, క్రీడా శాఖమంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మక్తల్ పడమటి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో రాంలీలా మైదానంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించగా.. మంత్రితోపాటు ఆయన సతీమణి వాకిటి లలిత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల మహిళలు బతుకమ్మలతో రాంలీలా మైదానానికి చేరుకున్నారు. మంత్రి సతీమణి సైతం బతుకమ్మతో అక్కడికి వచ్చి మంత్రితో కలిసి బతుకమ్మలకు పూజలు చేశారు. బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అందరు ఐక్యత, ఆటపాటలతో బతుకమ్మ సంబరాలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పూజలు చేస్తారని, ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఓ పక్క భారీ వర్షం కురుస్తున్న బతుకమ్మలతో రావడంపై మహిళలను అభినందించారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాధమ్మ, గణేష్‌కుమార్, రవికుమార్, రాజేందర్, గోవర్ధన్, కట్ట వెంకటేష్, కట్ట సురేష్ పాల్గొన్నారు.

రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటాం

కృష్ణా: మండలంలోని కృష్ణా, భీమా నదులు ఉప్పొంగడంతో నదీతీర ప్రాంతాల్లోని వరి పంటల్లోకి నీరు చేరి తీవ్ర నష్టం వాటిల్లగా.. విషయం తెలుసుకున్న మంత్రి వాకిటి శ్రీహరి సోమవారం తంగిడిలో సంఘమక్షేత్రాన్ని పరిశీలించారు.అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. కర్ణాటకలోని ప్రాజెక్టుల నుంచి దిగువకు అత్యధికంగా 5.60 లక్షల క్యూసెక్కుల నీటిని వదలడంతో ఈ ప్రాంతంలోని రైతుల పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరుతోందని, పంటలు నీటమునిగాయన్నారు. పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండడంతోపాటు వారిని అన్ని రకాలుగా ఆదుకుంటామని అన్నారు. వరద విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎరుపెక్కిన తెల్లబంగారం



▲ ఈ చిత్రంలో ఎరుపెక్కిన పత్తిపంట చూపుతున్న రైతు పేరు విజయ్. పల్లెగడ్డకు చెందిన ఈయన 5 ఎకరాల్లో పత్తి సాగు చేయగా వర్షాలకు దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. వర్షాల కారణంగా పొలంలో నీటిశాతం అధికం కావడంతో ఒక్కసారి కూడా పత్తితీయక ముందే పంటకు ఎరుపు తెగుళ్లు సోకింది. ఎకరాకు రూ.30వేల పెట్టుబడి పెడితే మూడు క్వింటాళ్ల పత్తి వచ్చే పరిస్థితి లేదని రైతు వాపోతున్నాడు. ఇప్పటి వరకు రూ.2 లక్షల పెట్టుబడి పెట్టాడు. మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి కేవలం రూ.5వేల నుంచి రూ.6 వేల మధ్య ఉంది. కానీ రూ.లక్ష వరకు కూడా ఆదాయం రాని పరిస్థితి ఉందని బాధిత రైతు ఆవేదన చెందుతున్నాడు.

ఎడతెరిపి లేని వర్షాలతో పత్తి పంటకు తెగుళ్ల బెడద

- తడిఆరని పొలం.. అమాంతం పడిపోయిన దిగుబడి
- పెట్టుబడి ఆశలు సైతం ఆవిరి



మరికల్‌లో ఎడతెరిపి లేని వర్షాలకు ఎరుపెక్కిన పత్తిపంట

మరికల్: జిల్లాలో కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు పత్తి పంటలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. నేల తడి ఆరకముందే వానలు కురుస్తుండటం ఎండలు లేక మబ్బులు ఆవరిస్తుండటంతో పూత రాలిపోతోంది. ఆకులు ఎర్రబారుతున్నాయి. కాయలు నల్లగా మారి రాలిపోతున్నాయి. పచ్చని ఆకులు, తెల్లని పత్తితో కళకళలాడాల్సిన పొలాలు పూత, కాత లేకుండా ఎండిపోయి కనిపిస్తుండటంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు పచ్చగా ఉన్న పంట రైతుల కళ్లెదుటే పత్తి పంట అమాంతం ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముసురు వర్షాలతో పొలాల్లోనే గింజలకు మొలకలు వస్తున్నాయి. పంట చేతికి వచ్చే తరుణంలో మొలకలు రావడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

జిల్లాలో 1.68 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో వరి తర్వాత అత్యధికంగా పత్తి సాగు చేస్తారు. జిల్లాలో ఈ ఏడాది 1.68 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మొదట కురిసిన వర్షాలకు మొక్కలు ఏపుగా పెరిగాయి. పూత, కాయ బాగుండడంతో ఆశించిన దిగుబడి వస్తుందని రైతులు ఆనంద పడ్డారు. వరుసగా కురుస్తున్న వర్షాలు రైతుల ఆశలను నిండా ముంచాయి. వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 10 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. జిల్లాలో భిన్నమైన వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఈ ఏడాది సాగు చేసిన పత్తిలో ఎకరానికి కనీసం రెండు నుంచి మూడు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు.



ఐదు ఎకరాల్లో మొదటిసారి తీయగా వచ్చిన ఓ మోస్తరు పత్తి

ఎకరాకు మూడు క్వింటాళ్లే..

రోజుల తరబడి కురుస్తున్న ముసురు వర్షాలతో పంటలకు సూర్యరశ్మి తగలక పత్తి మొక్కల్లో నీటి శాతం పెరిగి వాడిపోతున్నాయి. ఎండల్లేక కాయలు పగలటం లేదు. దీనికితోడు పొలాలు బురదగా మారడంతో కూలీలు పత్తితీత పనులకు రావడంలేదు. తడిసిన పత్తి నల్లగా మారుతుండటంతో మద్దతు ధర దక్కడం కష్టంగా మారింది. పోషకాలు అందక ఆకులు పసుపు ఎరుపు రంగుల్లోకి మారి ఎండిపోతున్నాయి. ఒక్కో రైతు మూడు నుంచి ఐదుసార్లు పత్తి ఏరుతుంటారు. కానీ, పూత లేకపోవటంతో ఒక్కసారికే సరిపెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎకరాకు పది క్వింటాళ్లు వచ్చే దిగుబడి ఇప్పుడు మూడు, నాలుగు క్వింటాళ్లకే పరిమితమవుతోందని రైతులు వాపోతున్నారు.

నీటి శాతం పెరగడం వల్లే తెగుళ్లు

అధిక వర్షాల వల్ల పంట వేర్లకు పోషకాలు అందక పత్తి కాయలు నల్లగా, ఆకులు ఎర్రగా మారి చివరకు చెట్టు ఎండిపోతుంది. దీంతో పంట దిగుబడులు కూడా తగ్గాయి. పంటకు పైన పిచికారీతో పోషకాలు అందించాలి. 3 గ్రాముల ఫంగీసైడ్స్ కాఫర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా లీటరు నీటికి 5 గ్రాముల యూరియా లేదా 15.15.15, లేదా 19.19.19 చల్లాలి. అప్పుడు పంటలో తెగుళ్ల శాతం తగ్గే అవకాశం ఉంది.

– జాన్‌సుధాకర్, ఏడీఏ

కమనీయం..
ఆది దంపతుల కల్యాణం


అమ్మవారి ఆలయంలో మంత్రి, కొండా సురేఖ, ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజ రామయ్యర్, ఎమ్మెల్యే విజయుడు


కుమారి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

- పట్టువస్త్రాలు సమర్పించిన దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- భారీగా తరలివచ్చిన భక్తులు.. కిక్కిరిసిన ఆలయ పరిసరాలు

అలంపూర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎనిమిదో రోజు మూల నక్షత్రం పురస్కరించుకొని అలంపూర్ ఆలయాల్లో జోగు శాంబ అమ్మవారు, బాలబ్రహ్మేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజ రామయ్యర్, ఎమ్మెల్యే విజయుడు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారు, స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో మంగళ వాయిద్యాలు, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు కల్యాణ వేడుకను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి వివిధ ప్రాంతాల భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

పూర్ణకుంభంతో స్వాగతం..

అలంపూర్‌కు వచ్చిన రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, దేవదాయశాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్, ఎమ్మెల్యే విజయుడికి ఆలయ ఈఓ దీప్తి, కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి, ప్రిన్సిపల్ కార్యదర్శి స్వామివారి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలను తలపై ఉంచుకొని అమ్మవారి ఆలయాలకు చేరుకొని సమర్పించి కుంకుమార్చన పూజలో పాల్గొన్నారు. అర్చకులు ఆలయ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం పలికారు. ఆలయ ఈఓ, పాలక మండలి సభ్యులు మంత్రికి పట్టువస్త్రాలు, జ్ఞాపిక అందజేశారు. వీరి వెంట జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, గద్వాల సంస్థాన వారసుడు కృష్ణ రాంభూపాల్, కాంగ్రెస్ నాయకులు, భక్తులు ఉన్నారు.

ఘనంగా సింహవాహన సేవ..

సోమవారం సాయంత్రం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి సింహవాహన సేవ ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సింహ వాహనంపై కొలువుదీర్చారు. ఈ సేవను ఈఓ దీప్తి ప్రారంభించగా.. పట్టణ వీధుల్లో ఊరేగించారు. వీధుల్లోకి వచ్చిన స్వామి, అమ్మవార్లకు భక్తులు జేజే పలుకుతూ పూజలు చేశారు.



మహాగౌరిగా దర్శనం..

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎనిమిదోరోజు జోగుళాంబ అమ్మవారు మహాగౌరిగా భక్తులకు దర్శనమిచ్చి విశేష పూజలు అందుకున్నారు. అర్చకులు అమ్మవారికి కొలువు, కుమారి, సువాసిని పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారు చతుర్భుజాలు కలిగి ఉంటారని.. కుడి వైపు త్రిశూలం, అభయ హస్తం, ఎడమ వైపు ఢమరుకం, వరద ముద్ర ఆశీస్సులిస్తూ భక్తులకు దర్శనమిస్తారని అర్చకులు వివరించారు. అత్యంత శాంతమూర్తి అని.. ఈ మాతను ఆరాధించడంతో పాపాలు నశిస్తాయని, కష్టాలు తొలగుతాయని, సకల సౌభాగ్యాలతో పాటు మంగళం చేకూరుతుందని, కల్యాణప్రాప్తి కలుగుతుందని చెప్పారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో తరలి రావడంతో ఆలయాలు కిటకిటలాడాయి.

జూరాలకు భారీగా వరద

- ఎగువ నుంచి 5.37 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టు 39 క్రస్టుగేట్ల ఎత్తివేత


జూరాల 39 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

ధరూరు/రాజోళి: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి పెరిగింది. ఆదివారం రాత్రి 8గంటల వరకు ప్రాజెక్టుకు 5.7లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సోమవారం రాత్రి 8:30 గంటల వరకు 5.37లక్షల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో ఇంత పెద్ద మొత్తంలో ఇన్‌ఫ్లో వచ్చి చేరడం ఇదే మొదటి సారి. దీంతో ప్రాజెక్టు 39 క్రస్టుగేట్లను ఎత్తి 5,60,83 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జెన్‌కో జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. ఆవిరి రూపంలో 41, కుడి కాల్వకు 300 క్యూసెక్కులతో కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 5,60,524 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.310 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

- సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి 71,114 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 16 గేట్లను ఒక మీటర్ మేర తెరిచి 67,312 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. కేసీ కెనాల్‌కు 2,012 క్యూసెక్కులు వదిలినట్లు పేర్కొన్నారు.

సంగమ క్షేత్రం.. జల దిగ్బంధం

- ఉగ్రరూపం దాల్చిన కృష్ణా, భీమా నదులు
- దత్త భీమేశ్వరాలయంలోకి చేరిన వరద

కృష్ణా: మండలంలోని కృష్ణా, భీమా నదులు ఉగ్రరూపం దాల్చాయి. రెండు రోజులుగా ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వరద ఉధృతితో సోమవారం కృష్ణా మండలం తంగిడి సమీపంలోని సంగమ క్షేత్రంలో ఉన్న దత్త భీమేశ్వరాలయం జలదిగ్బంధనమైంది. కృష్ణా, భీమా నదీతీరంలోని గ్రామాల సమీపంలోకి వరద చేరుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వారం రోజులుగా కర్ణాటక, మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండటంతో కృష్ణానదిపై ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్, భీమా నదిపై ఉన్న సన్నత్తి, చిత్తాపూర్, యాద్గిర్, గూడూర్ బ్యారేజీల నుంచి 5.70లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో కృష్ణా, భీమా నదులకు వరద ఉధృతి పెరిగింది. దీంతో కృష్ణా మండలంలోని వాసుగనగర్, హిందూపూర్, గుర్జాల్ గ్రామాలతో పాటు ముడుమాల్, కృష్ణా, తంగిడి, సూకూర్ లింగంపల్లితో పాటు మాగనూర్, మక్తల్ మండలాల్లోని పలు గ్రామాలకు వరద ముంపు ముప్పు పొంచి ఉంది. వరద ఏమాత్రం పెరిగినా నదీ తీరంలోని గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధనమయ్యే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.


వాసూనగర్ సమీపంలో మునకకు గురైన పంట పొలాలు


సంగమ క్షేత్రంలో జలదిగ్బంధనమైన దత్త భీమేశ్వరాలయం


వాసునగర్ వద్ద పారుతున్న వరద

పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలి


ప్రైవేట్ పరిశ్రమను ప్రారంభిస్తున్న పంజాబ్ డిప్యూటీ మాజీ సీఎం సుఖ్జిందర్‌జింగ్ రందావా, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, శంకర్ తదితరులు

జడ్చర్ల: పరిశ్రమలలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పోలేపల్లి సెజ్‌లో ఓ పరిశ్రమను పంజాబ్ డిప్యూటీ మాజీ సీఎం సుఖ్జిందర్‌సింగ్ రందావాతో కలిసి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, స్పోర్ట్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు కావడం శుభపరిణామమని, పరిశ్రమల స్థాపనతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చలువతో పోలేపల్లి సెజ్ ఏర్పాటైందని, అప్పుడే పరిశ్రమల స్థాపనకు పునాది పడిందని గుర్తుచేశారు. అదే ఒరవడితో జడ్చర్ల ప్రాంతానికి అనేక పరిశ్రమలు తరలివచ్చాయని, పారిశ్రామిక రంగానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. అలాగే పరిశ్రమలకు సంబంధించి సీఎస్‌ఆర్ నిధుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలని పరిశ్రమల యాజమాన్యాలను కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జ్యోతి, వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, నాయకులు నిత్యానందం, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి
ఫొటోగ్రాఫర్‌కు జాతీయ అవార్డు

పెద్దకొత్తపల్లి: ఫొటో జనరిక్ ఆర్ట్స్ సర్కిల్ సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమిక్ వా రు ఫొటోగ్రఫీ డే ను పురస్కరించుకొని ఆగస్టు 19న ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో పెద్దకొత్తపల్లికి చెందిన పిట్టల మహేష్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ నెల 28న గుంటూర్‌లో ఫొటో జనరిక్ ఆర్ట్స్ సంస్థ సర్కిల్ వ్యవస్థాపకులు కనకాల సుధాకర్‌రెడ్డి, తీయగుర సీతారామిరెడ్డి చేతుల మీదుగా మహేష్ జాతీయ అవార్డును అందుకున్నాడు. దీంతో మహేష్‌ను నాగర్‌కర్నూల్ ఫొటోగ్రఫీ జిల్లా అధ్యక్షుడు శ్రీమిత్ర రాజు, కాశీం, రాజు, లింగం, నర్సింహ, గోపి, మహేష్ అభినందించారు.



ట్రాన్స్‌జెండర్లపై కేసు నమోదు

అయిజ: మండలంలోని తెలంగాణ చౌరస్తాలో ఓ దుకాణాదారుడిపై దాడి చేసి న కేసులో ఏ దుగురు ట్రాన్స్‌జెండర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాన్స్‌జెండర్లు సోమవారం రాత్రి శివ బుక్ సెంటర్ అనే దుకాణం వద్దకు వెళ్లి దసరా పండుగ మాములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. షాపు యజమాని అమ్రేష్ కుమార్ రూ. 20 ఇస్తాననగా రూ. 500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతడు అంతడబ్బు ఇవ్వలేనని చెప్పడంతో పేపర్ రోల్‌తో తలపై కొట్టారు. పరువు తీస్తామని బెదిరింపులకు పాల్పడంతో బాధితుడు మరికొందరితో కలిసి వెళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ట్రాన్స్‌జెండర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

పెళ్లి బృందం వాహనం బోల్తా

- ప్రమాద సమయంలో 59 మంది
- 12 మందికి తీవ్రగాయాలు, కర్నూలుకు తరలింపు
- ఇటిక్యాలపాడు శివారులో జాతీయ రహదారిపై ఘటన


అంబులెన్స్‌లో క్షతగాత్రులు

ఉండవెల్లి: నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం కారణంగా పెళ్లి బృందంతో వెళ్తున్న డీసీఎం బోల్తాపడిన సంఘటన మండలంలోని ఇటిక్యాలపాడు శివారులో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. ఏపీలోని కర్నూలు జిల్లాకు చెందిన పెళ్లి కుమార్తె బంధువులు జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లిలో పెళ్లి కుమారుడి ఇంటికి సోమవారం వలిమా వేడుకల కోసం 59 మంది డీసీఎంలో వచ్చారు. రిసెప్షన్ అనంతరం రాత్రి 10 గంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణమవగా.. ఇటిక్యాలపాడు శివారులో జాతీయ రహదారిపై పంక్చర్ కావడంతో లారీ ఆగి ఉండగా.. వేగంగా వచ్చిన డీసీఎం సడెన్ బ్రేక్ వేయడంతో రోడ్డు పక్కన అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 12 మందికి తీవ్రగాయాలు, ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. డీసీఎంలో ఉన్న చిన్నారులు, పెద్దలు, మహిళలు పెద్దగా కేకలు వేయడంతో ఇతర వాహనదారులు వచ్చి వారిని బయటికి తీశారు. ఇందులో 12 మందికి తీవ్రగాయాలు కావడంతో రెండు 108 అంబులెన్స్‌లలో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. డీసీఎం కింది బాగానా ఇద్దరు ఇరుక్కోగా.. క్రేన్ సహాయంతో బయటికి తీశారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలను ఎస్‌ఐ శేఖర్, హైవే సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


ట్రాఫిక్ జాంతో ఆగిన వాహనాలు


ప్రమాదంలో బోల్తా పడిన వాహనం

డ్రగ్స్ రహిత సమాజం కోసం బైక్ యాత్ర


బైక్ యాత్ర చేపట్టిన ప్రభాకర్

చారకొండ: గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం సూర్యాపేట జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ చేపట్టిన బైక్ యాత్ర సోమవారం చారకొండకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు యువత బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై జన చైతన్యం కల్పించేందుకు ఈ నెల 21న సూర్యాపేట నుంచి బైక్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1400 కిలోమీటర్లు ప్రయాణించి ప్రజలను చైతన్యవంతం చేయడం జరిగిందన్నారు. యువత మత్తుకు బానిస కాకుండా ఉన్నత లక్ష్యం దిశగా ముందుకు సాగాలని కోరారు.

వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తి

- కాపాడిన యువకుడు



దేవరకద్ర: కౌకుంట్ల, ఇస్రంల పల్లి గ్రామాల మధ్య ఉన్న వా గులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కొట్టుకుపోతుండగా.. కౌకుంట్లకు చెందిన యువకుడు నీటి ప్రవాహంలో దూకి బాధితు డిని కాపాడిన ఘటన సోమ వారం జరిగింది. వివరాలు.. ఇస్రంపల్లికి చెందిన పాష పని మీద సోమవారం స్వగ్రామం నుంచి నుంచి వాగును దాటి కౌకుంట్లకు వచ్చాడు. తిరిగి గ్రామానికి వెళ్లడానికి వాగును దాటుతుండగా నీటి ప్రవాహం ఉధృతంగా కారణంగా పాష నీటిలో కొట్టుకుపోయాడు. అయితే వాగును చూడడానికి అక్కడికి వచ్చిన కౌకుంట్లకు చెందిన మల్లేశ్ వెంటనే అప్రమత్తం అయి వాగులోకి దూకి కొట్టుకుపోతున్న పాషను కాపాడి ఒడ్డుకు చేర్చాడు. ఎంతో ధైర్యంతో నీటి ప్రవాహంలో దూకి మరో వ్యక్తిని కాపాడినందుకు మల్లేశ్‌ను కౌకుంట్ల, ఇస్రంపల్లి గ్రామస్తులు అభినందించారు.

లింక్ క్లిక్.. రూ.1.95 లక్షలు మాయం

నాగర్‌కర్నూల్ క్రైం: ఫోన్‌కు వచ్చిన అనుమానాస్పద లింక్‌ను క్లిక్ చేయడంతో బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయమైన ఘటనపై కేసు నమోదైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ సోమవారం తెలి పారు. పూర్తి వివరాలు.. ఈ నెల 22న జిల్లా కేంద్రంలోని మటన్ వ్యాపారి సంపత్ ఫోన్‌కు వచ్చిన ఆర్టీఏ చానల్ లింక్‌ను క్లిక్ చేయడంతో బ్యాంక్ ఖాతాలోని రూ.1.95 లక్షల నగదు సైబర్ నేరస్తులు మాయం చేశారు. ఫోన్‌కు నగదు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించి, ఆన్‌లైన్‌లో సైబర్ క్రైంకు ఫిర్యాదు చేయడంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ముగ్గురు యువకుల అరెస్టు



గద్వాల క్రైం: పానీ పూరి బండి నిర్వాహకుడిపై ఆదివారం రా త్రి మద్యం మత్తులో దాడి చేసి బండి అద్దా లు ధ్వంసం చేసిన ఘటనలో ముగ్గురు యు వకులను పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ వివరాల మేరకు.. మధ్యప్రదేశ్‌కు చెందిన మంగళ్ గద్వాలకు వచ్చి పానీపూరి బండి ఏర్పాటు చేసుకొని ఉ పాధి పొందుతున్నాడు. పట్టణానికి చెందిన రాఘవేంద్ర అలియాస్ సోను, శశి, ఎస్కే నర్సింహాలు మద్యం సేవించి పానీపూరి తినేందుకు వచ్చారు. తిన్న తర్వాత డబ్బులు ఇచ్చే విషయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో శశి అనే యువకుడు బండి అద్దా లు ధ్వంసం చేసి, గ్యాస్ సిలిండర్‌ను తీసుకుని రోడ్డుపైకి విసిరేశాడు. స్థానికులు నిలువరించే ప్రయత్నం చేయగా వారిపై కూడా దాడి చేసే ప్రయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రాఘవేంద్ర ఓ ఘర్షణ కేసులో జైలుకు వెళ్లి రెండు రోజుల క్రితమే బెయిల్‌పై బయటకు వచ్చాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. పట్టణంలోని సీసీవై యూత్ యువకులు పానీపూరి బండి నిర్వాహకుడిపై దాడి చేసినట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం


వెంకటయ్య(ఫైల్)

చారకొండ: భార్య మరణంతో మనస్తాపాని కి గురై వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘట న మండలంలో చోటు చేసుకుంది. గ్రా మస్తులు, పోలీసులు తెలి పిన వివరాలు.. మండలంలోని జేపల్లికి చెందిన వంకేశ్వరం వెంకటయ్య (35) భార్య ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ నేపథ్యంలో మనస్తాపంతో వెంకటయ్య అనారోగ్యాకి గురై, ఆర్థిక ఇ బ్బందులతో ఆదివా రం రాత్రి ఇంట్లో పైకప్పు కు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమ వారం తెల్లవారుజామున గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఎస్‌ఐ శంషోద్దీన్ చేరుకొని ఆత్మహత్యకు గల వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.